# గ్రహాణం

నవల



గంటి భానుమతి

# గ్రహణం

నవల

గంటి భానుమతి

గంటి ప్రచురణలు

హైదరాబాదు

***Grahanam***

By **Ganti Bhanumathi**

© Ganti Bhanumathi

*First Edition* : 2016

*Price* : ₹ 100/- $ 5

*For Copies* :

**Ganti Bhanumathi**
Plat # 205, Block - I, May flower Park Aprts.
Annapurna Colony, Mallapur
Hyderabad - 500 076, Ph: 040-2715 1439
Mobile: 8897 643 009

&

**All leading Bookshops**

*Book Production* :

*'Pustakashilpi'*
**T. Muralidhar Gowd**
tmgowd@gmail.com

*Cover concept*:
**Vaadhoolasa**

*Cover design*:
**T. Mallesh**

*D.T.P.* :
**K.B.T. Kondaiah**

*Published by* :
**Ganti Prachuranalu**
Hyderabad - 500 076

*Printed at :*
**Karshak Art Printers**
(*Multicolour Printers & Designers*)
40-APHB, Vidyanagar, Hyderabad - 500 044
Ph : 040-2761 8261

# నా మాట

**నా** రచనల్లో కుటుంబ విలువలకు, వ్యక్తుల మధ్య ఉండాల్సిన, ప్రేమ ఆప్యాయతలకి ప్రాధాన్యత ఇచ్చాను. ఓ కుటుంబం ఎలా ఉండాలో, ఎలా ఉండకూడదో అన్న కోణంలోంచే రచనలు చేస్తూ వచ్చాను. అటువంటి విషయాలనే తీసుకుని వ్రాయటం జరిగింది.

ఈ 'గ్రహణం' కూడా అటువంటి కోవలోకే వస్తుంది. చిన్న చిన్న విషయాలకి, విడాకుల వరకు వెళ్ళిపోతున్న భార్యాభర్తలని చూసి, చదివి రాసిన నవల ఇది. వారి మధ్య ఏర్పడే అగాధం ఎలా, ఎందుకు ఏర్పడిందో, ఎలా పూడిపోయిందో, రాసిన నవల ఇది. జీవితంలో, భార్యాభర్తల సంబంధాల్లో, ఎదురయ్యే సమస్యలు అన్నీ కూడా పరిష్కరించుకోవచ్చు. ఇవి అన్నీ కూడా, ఆగి, కురిసి, వెళ్ళిపోయే మబ్బుల్లాంటివి. గ్రహణాల్లాంటివి.

ఈ నవల ఆంధ్రభూమి దినపత్రికలో సీరియల్‌గా వచ్చింది. అందుకు ఆ పత్రిక సంపాదకులు శ్రీ ఎం.వి.ఆర్. శాస్త్రిగారికి నా కృతజ్ఞతలు.

ఈ పుస్తకాన్ని శ్రద్ధతో ఇంత అందంగా రూపొందించిన ప్రముఖ రచయిత, 'పుస్తకశిల్పి' శ్రీ తాళ్ళపల్లి మురళీధరగౌడుగారికి, డి.టి.పి. నిర్వహించిన శ్రీ కె.బి.టి.కొండయ్యగారికి, ముచ్చటైన ముఖచిత్రాన్ని రూపకల్పన చేసిన శ్రీ తుమ్మూరి రాంమోహన్ రావు (వాధులస) గారికి, శ్రీ టి.మల్లేశ్‌గారికి, సకాలంలో ప్రచురించిన కర్షక్ ఆర్ట్ ప్రింటర్స్ అధినేత శ్రీ ఎ.జగన్మోహన్‌రెడ్డిగారికి ధన్యవాదాలు.

*గంటి భానుమతి*

# గ్రహణం

ఫిబ్రవరి నెల. సోమవారం ఉదయం పదకొండున్నర. చిరు చలి వేస్తోంది.

కిటికీలోంచి బయటికి చూస్తోంది సుధీర.

ఆకుల్లేని కొమ్మలు, చేతులు చాపినట్లుగా ఉన్నాయి. వాటిపైనుండి ఉడతలు, హడావుడిగా, అటూ ఇటూ పరిగెడ్తూ కిందపడ్డ ఎండుటాకుల మీదనుంచి, సన్నటి శబ్దం చేస్తూ ఆడుకుంటున్నాయి. చూపు బయట ఉన్నా మనసు మాత్రం ఎటో వెళ్లిపోయింది.

"మీరు టీ తాగడానికి వెళ్ళరా!"

ఉలిక్కిపడింది. దృష్టి మరల్చింది. ఆ మాటలు అన్న మనిషిని చూసింది, కౌశిక్.

నిశ్శబ్దంగా ఉండిపోయింది.

"ఏదో ఆలోచిస్తున్నారు. మీ ఆలోచనలకి ఆటంకం కలిగించానా!"

లేదన్నట్లుగా తలూపింది సుధీర.

"సెక్షన్ అంతా ఖాళీగా ఉంది. మీరొక్కరే బయటికి వెళ్ళకుండా ఉన్నారు. టీ తాగరా!"

"మీరు కూడా వెళ్ళలేదు కదా!"

కౌశిక్ చిరునవ్వు నవ్వాడు.

"నా ప్రశ్నకి సమాధానం ప్రశ్న కాదు. అయినా చెప్తాను. నాకు టీ తాగే అలవాటు లేదు.

కాఫీ తెమ్మని యాదగిరికి చెప్పాను”– అలా అంటూండగానే యాదగిరి చిన్న ఫ్లాస్కుతో వచ్చాడు.

“అదిగో మాటల్లోనే వచ్చాడు. రండి ఈ వాతావరణంలో చక్కటి కాఫీని తాగి ఆనందిద్దాం...”

సుధీర లేచే ప్రయత్నం చేయలేదు. సమాధానం కూడా చెప్పలేదు.

“రండి... ఎంతసేపలా కిటికీలోంచి బయటికి చూస్తారు? రండి...” అంటూ సుధీర సమాధానం కోసం ఎదురుచూడకుండా తన సీటువైపుగా నడిచాడు.

కౌశిక్ యూ.పి. వాడు. ఆకర్షణీయమైన పర్సనాలిటీ, మంచి తెలుపు. అందరితో నవ్వుతూ మాట్లాడుతాడు. నలభై ఏళ్ళుంటాయి. హైస్కూలు చదువులు చదువుతున్న ఇద్దరు పిల్లలున్నారు. సుధీర లేవలేదు. కౌశిక్‌వైపు చూడలేదు.

సుధీరని ఓసారి చూసి, కాఫీని రెండు కప్పుల్లోపోసి, ఒకటి సుధీర ముందుంచి, తను ఒకటి పట్టుకుని, స్టూలు లాగి, దాని మీద కూచున్నాడు.

సుధీర తల, కళ్ళు ఎత్తి కౌశిక్‌ని చూసి, ‘థాంక్స్’ అంటూ కప్పుని పట్టుకుంది.

చిరునవ్వుతో చూసి, తలని కదిలించాడు.

“మీ వ్యక్తిగతం అని అనుకోకపోతే, ఓ కొలీగ్‌గా అడుగుతున్నాను. మీరిప్పుడు ఓ పెద్ద సమస్యని ఎదుర్కొంటున్నట్లు తెలిసింది...”

సుధీర చివ్వున తలెత్తింది. ఆమెకి ఆశ్చర్యంగా ఉంది. కౌశిక్ ఏం మాట్లాడ బోతున్నాడో...

“లేదే...” అంది మెల్లిగా.

“మీరు లేదు అన్నంత మాత్రాన నేను నమ్మేస్తానా... మీరు కష్టంలో ఉన్నది నిజం కాదా!...”

“మీకెలా తెలుసు?” అంది సంకోచిస్తూ.

“నాకే కాదు... చాలామందికి తెలుసు. అయినా ఏదో ఒక రోజున తెలియాల్సిన విషయమే కదా...!”

సిగ్గుతో తలవంచుకుంది.

సుధీరకి అర్థం కాలేదు. తనెందుకు సిగ్గుపడిందో! నిజంగా సిగ్గుపడాల్సినట్లుగా ఉందా పరిస్థితి... లేదు. తను సిగ్గుపడకూడదు. ధైర్యంగా, తల ఎత్తుకోవాలి. ఏదో రోజున అందరికీ తెలుస్తుందని తెలుసు. ఇలాంటి ప్రశ్నలని ఎదుర్కోవాల్సి వస్తుందని తెలుసు. అయితే ఇంత తొందరగానా!

ఇవాళ కౌశిక్. రేపట్నుంచి, ఎంతోమంది కౌశిక్‌లు. అందరూ తన చుట్టూ ఉండేవాళ్ళే. ఎంతో కొంత పరిచయం ఉన్నవాళ్ళే. కొంతమంది వెనకాల అనుకుంటారు. కొంతమంది మొహంమీదే అడుగుతారు. వెనకాల అనుకుంటే సంస్కారం ఉన్నట్లు! ఏవిటో తన పిచ్చి.

"ఒక్కమాట చెప్తాను. ఫీల్ అవకూడదు. ఏదైనా నీలో ఉన్నంత వరకే అది నీ వస్తువు. అది బయటికి వెళ్లిందంటే, పబ్లిక్ ప్రాపర్టీ. నీ విషయంలో అదే జరిగింది. నువ్వు ఎవరెవరి నోళ్ళు మూయించగలవు. ధైర్యం ఉంటే ఓ రాయిలా, దేనికీ చలించ కుండా ఉండాలి..."

అమ్మకూడా, ఇలాగే, ఇంచుమించు ఇదే అర్థం వచ్చేలా అంది. అయినా, కౌశిక్‌కి ఎలా తెలిసింది! ఎవరు చెప్పి ఉంటారు? సరోజ... వినీత...

వీళ్లిద్దరికీ తను చెప్పింది ఇల్లు చూడమని... వాళ్లిద్దరే చెప్పడానికి అవకాశం ఉంది.

ఏవిటో, జీవితం తెరిచిన పుస్తకంలా అయిపోతోంది. అందులోకి, అందరూ తొంగిచూసేలా, తనే చేసుకుంది.

తనకి నచ్చినట్లుండే ప్రాథమిక హక్కుని వినియోగించుకుంటోంది. అందులో అందరూ జోక్యం చేసుకోవాల్సిన అవసరం ఏముంది!

చిన్నగా తల ఊపింది.

"నిజమే, కౌశిక్, అందరికీ తెలియడానికి అవకాశాన్ని నేనే ఇచ్చాను. తప్పంతా నాదే. నేనే ఏదో ఇమోషన్‌లో వినీతకి చెప్పాను. ఎందుకంటే, వినీత ఇంటి దగ్గరే మా పిల్లల స్కూలుంది. దగ్గర్లోనే బస్టాపు. అక్కడినుంచి ఆఫీసుకి బస్సులు చాలా ఉన్నాయి. అందుకని, ఓ మంచి స్నేహితురాలి లాగా ఆమెని సాయం కోరాను. కానీ, పూర్తిగా బెడిసికొట్టింది. అనర్థమే జరిగింది...

కౌశిక్ ఆమె మాటల్ని పట్టించుకోలేదు.

"మీ స్నేహితురాలికి చెప్పి, మీరు మంచే చేసారో, ఆమె మీకు చెడు చేసిందో, బెడిసికొట్టిందో, అనర్థమే జరిగిందో... అదంతా వేరే. దాని గురించి, నాకేం తెలీదు. నేనేం అడుగను...

"అయినా మనం మన మనసులోని బాధల్ని స్నేహితులతో చెప్పకపోతే, ఇంకెవరికి చెప్పుకుంటాం! కొన్ని కొన్ని విషయాలని, దగ్గర బంధువులకి కూడా చెప్పకుండా స్నేహితులకే చెప్తాం..."

సుధీరకి కాఫీ చేదుగా అనిపించింది. మింగుడు పడటం లేదు.

"నిజం. ఎవరికీ చెప్పుకోకుండా, వినీతకి చెప్పాను. ఎప్పుడైతే నేను బయటపడ్డానో, అప్పుడే ఆ విషయం సార్వజనీనం అయిపోయింది. అవసరం నాది. సాయం కోరాను. జనరల్ హ్యూమన్ టెండెన్సీ.

"మీరు అనుకుంటున్నది నిజమే. నేనే వేరే ఉండటానికి నిశ్చయించుకున్నాను. మొగుడు చేసే అన్యాయాన్ని భరించలేకపోయాను. ఎందుకు అని అడిగితే, పర్యవసానం ఇలా ఉంటుంది.

"అభిమానం ఉంది. ఉద్యోగం ఉంది. పిల్లల్ని పోషించుకోగలను. ఆ ధైర్యం నాకుంది..." కొంచెం కఠినంగా ఉంది.

కౌశిక్ ఆశ్చర్యంగా సుధీరని చూశాడు.

అందంగా ఆకర్షించే విధంగా ఉంటుంది. పర్సనల్ మేనేజ్‌మెంట్‌లో డిప్లొమా చేసి, నాలుగైదు కంపెనీలు మారి ఈ కంపెనీలో చేరింది. మంచి జీతం. ఆమె నా భార్య అని గర్వంగా పరిచయం చేసే విధంగా ఉంటుంది.

అలాంటిది... ఇలా... ఎక్కడో కమ్యూనికేషన్ గ్యాప్.

"మీది ప్రేమ వివాహం కాదా!..."

అవునన్నట్లుగా తల ఊపింది.

"అయితే కట్నం కోసం వేధింపులా!"

కాదన్నట్లుగా తల ఊపింది.

"తాగుడు... పేకాట... జూదం... గుర్రప్పందేలు."

"ఛ... ఛ... అలాంటివేం లేవు..."

"బాగా తిట్టి, బాగా కొట్టి, హింసిస్తారా!"

తల అడ్డంగా ఊపింది. ఏవిటీ ప్రశ్నలు సిగ్గుగా అనిపించింది.

"మీ మధ్య మూడో మనిషి ఉందా! పతి పత్నీ ఔర్ వో..." తన అనుమానం చెప్పడానికి ఇష్టపడలేదు. కానీ కారణం దీక్ష. ఆమె కారణంగా విడిపోవడం, అలా అని ఒప్పుకోవడం ఇష్టంలేకపోయింది.

"లేదు" అంది.

వింతగా చూశాడు.

"ఇవేవీ కానప్పుడు, మీ సమస్య అంత సీరియస్ అయినదని నేననుకోను. మీరిద్దరూ మీ అహంకారాలని తృప్తిపరచుకోడానికి మీ పిల్లల్ని బలి చేస్తున్నారు. వాళ్ళ భవిష్యత్తుని పాడుచేస్తున్నారు. ఈ విషయం మీ దృష్టిలోకి వచ్చిందా! తెలిసే ఈ అడుగు వేస్తున్నారా? బాగా ఆలోచించుకునే నిర్ణయం తీసుకున్నారా!"

వెంటనే సుధీర, బాధగా కౌశిక్‌ని చూసింది.

"మీరు నన్ను తప్పు పడ్తున్నారా!..." సీరియస్‌గా అంది.

వెంటనే తల అడ్డంగా ఊపాడు.

"లేదు... లేదు... మీ మంచి కోరేవాడిని కాబట్టి, అన్నాను. ఇదివరకూ చిరునవ్వుతో కనిపించేవారు. అది ఈ మధ్య లేదు. మీరు ఏదో బాధలో ఉన్నారని, చెప్పకుండానే తెలిసిపోతోంది. ఈ విడిపోవడం వల్ల నష్టమే కానీ లాభం లేదు. సర్దుకుపోగలిగితే సర్దుకుపోండి..."

సుధీర అప్రసన్నంగా మొహం పెట్టింది.

"ఈ పాఠం చెప్పడానికా, కాఫీ తాగుదాం అని అన్నారు... సారీ..." అంటూ కప్పుని ముందుకి తోసింది.

"సారీ... నేను పాఠం చెప్పాలనుకోలేదు. ఓ ప్రేక్షకుడిగా చూసాను. శ్రోతగా విన్నా. ఓ తోటి ఉద్యోగిగా, సాటి మనిషిగా అన్నీ తెలిసీ ఊరుకోలేకపోయాను. ఒక్కొక్కసారి ఎదుటివాళ్ళకి పరిష్కారమార్గాలు కనిపిస్తాయి. అందుకే చెప్తున్నాను...

విడిపోవడం చాలా తేలిక. ఆ తర్వాత కలవడం కష్టం.

ఈ చర్యవల్ల మీరు మానసిక రోగులు కాకూడదని నేను కోరుకుంటున్నాను. జీవితం సినిమా కాదు, పదహారు రీళ్ళ తర్వాత ఫలితం తెలియడానికి. ముగింపు ఎలా ఉంటుందో తెలుసుకోవడానికి పూర్తి జీవితం అయిపోతుంది. ఏది చేసినా బాగా ఆలోచించి చేయండి. లేకపోతే, దాని ప్రభావం మీ ఇంట్లో వాళ్ళమీద, పిల్లలమీద అందరిమీదా ఉంటుంది...”

సుధీర అసహనంగా కదిలింది.

“మీరు చేస్తున్నది పోరాటమా! అహంకారాల పోరాటమా! గెలవాలని పోరాటం చేస్తున్నారా! ఒకవేళ ఓడిపోతే... ఓటమిని అంగీకరిస్తారా! అది కూడా నేర్చుకోవాలి... పోరాట ఫలితం ఏ విధంగా ఉన్నా ఫర్వాలేదా...”

సుధీర ఏం మాట్లాడలేదు.

ఒక్కొక్కళ్ళే రావడం మొదలెట్టారు.

సుధీరకి అందరూ తననే చూస్తున్నారనిపిస్తోంది. వీళ్ళందరికీ తన గురించి, విక్రాంత్ గురించి తెలిసిపోయిందన్న ఆలోచన రాగానే ఒక్కసారి దుఃఖం వచ్చింది.

గబగబా బాత్రూంలోకి వెళ్ళి ఏడ్చేసింది. మొహం కడుక్కుని, అద్దంలో మొహం చూసుకుంది తనని తాను ప్రశ్నించుకుంది.

ఎందుకేడ్చింది! అసలు ఏడుపు ఎందుకొస్తోంది! విడాకులు తీసుకోవాలన్న ఆలోచన వచ్చినప్పుడు ఎంతో ధైర్యంగా ఉంది. ఇపుడు ఆ ధైర్యం ఎందుకు లేదు! ఎందుకీ నిస్సహాయత్వం! తన మీద తనకే జాలివేస్తోందా! తనలో ఏదో లోపించింది. అందుకే ఈ బేలతనం.

బాధ అంతా కళ్ళలోంచి బయటికి వచ్చాకా, మనసు కొంచెం తేలికయింది.

అద్దంలో మరోసారి మొహం చూసుకుని బయటికి వచ్చింది. కానీ, ఆఫీసులో వుండాలనిపించలేదు.

ఇక్కడున్న అందరికీ తన జీవితం ఎలా నడుస్తోందో, ఏ దిశగా వెళ్తోందో తెలిసిపోయింది. వాళ్ళ చూపులు ఎదుర్కోవాలనిపించడం లేదు. ఇంటికెళ్తే బాగుంటుం దనిపిస్తోంది.

పనిమీద ఏకాగ్రత కుదరడంలేదు. పర్మిషన్ ఇవ్వరు, సెలవు పెట్టుకోవాల్సిందే. అందుకని, పర్సనల్ మేనేజర్ దగ్గరికి వెళ్ళింది. అతను జనరల్ మేనేజర్ గదిలో ఉన్నాడు.

ఆమెను, గాజు పార్టిషన్‌లోంచి చూసిన మేనేజర్ సుధీర్ దగ్గరికి వచ్చి, ఆమెను చూస్తూ తన సీట్లో కూచున్నాడు.

సుధీర ఏం మాట్లాడకుండా లెటర్‌ని అతని ముందుంచింది.

"ఇంట్లో ఏదైనా ఇబ్బందిగా ఉందా?"

తెల్లబోయింది సుధీర. వెంటనే తేరుకుంది. ఏం అనలేక ఏం లేదు అన్నట్లు తల ఊపి వచ్చేసింది.

ఇతనికి కూడా తెలుసన్నమాట.

తెలిస్తే తెలియనీ అన్న మొండి ఆలోచన ఇంకా రాలేదు. అందుకే సుధీర బాధపడింది.

ఎదుర్కోవాలి. తను ధైర్యంగా ఉండకపోతే, తనమీద తనకే జాలి వేసి, మరుగుజ్జులా అయిపోవచ్చు.

ఇల్లు చేరేసరికి మధ్యాహ్నం రెండు. తల నొప్పిగా అనిపించి అలాగే పడుకుంది.

ప్రతిభ ఫోన్ చేసింది.

"ఇంటికి వెళ్లిపోయానని తెలిసింది. ఎందుకని?"

"ఊరికే... ఆఫీసులో ఉండాలనిపించక వచ్చేసాను..."

"ఏమీ అనుకోకపోతే, అడుగుతాను..."

సుధీరకి తెలుసు ఆమె ఏమి అడగాలనుకుంటుందో?

"ఎందుకిలా జరుగుతోంది... పిల్లల సంగతి ఆలోచించవా?"

"పిల్లలు నాక్కావాలి. నా దగ్గరే ఉంటారు. వాళ్ళని నేను బాగా పెంచగలను. మంచి పౌరుల్లాగా..."

"అది సరే, నువ్వు బాగా పెంచుతావు. మరి విక్రాంత్ సంగతేమిటీ? పిల్లలు కావాలని అడగ లేదా?"

"పెద్దగా అడగలేదు. తీసుకెళ్లమన్నట్లుగానే మాట్లాడాడు..."

"మళ్లీ పెళ్లి చేసుకోవడానికి అడ్డుగా ఉంటారని కావచ్చునేమో..."

సుధీరకి ఆ మాటలు నచ్చలేదు. విక్రాంత్ గురించి ప్రతిభ అలా అనడం బాధగానే అనిపించింది.

"లేదులే. మొదట పిల్లలు కావాలని అడిగాడు. కానీ, నేనే, ఇవ్వనని అన్నాను. ఆడవాళ్ళు పెంచినంత బాగా మగవాళ్ళు పెంచరని అన్నాను... ఇంకేం మాట్లాడలేదు..." అది నిజం కాదని తెలుసు.

"మరోసారి ఆలోచించు. పిల్లలు నీకూ కావాలి. విక్రాంత్‌కి కూడా కావాలి..." అంది ప్రతిభ.

"అంత పిల్లలమీద ప్రేమ ఉంటే... పిల్లల్ని ఉంచేయమని దెబ్బలాడేవాడు కదా. ఆ మాట అనలేదు కదా!..." అంది సుధీర.

"ఎన్నిసార్లు అంటాడు! ప్రతి తండ్రికి పిల్లల మీద ప్రేమ ఉంటుంది. మీ ప్రేమ ఫలితంగానే ఈ పిల్లలు పుట్టారు కదా, ఇప్పుడు ఆ ప్రేమ స్థానంలో ఉన్న అహాన్ని, స్వార్థాన్ని మరోపక్కకి తోసెయ్యచ్చు కదా... మా ఇద్దరి పిల్లలు, మా ఇద్దరికీ కావాలి... అలాంటప్పుడు కలిసే ఉండచ్చు కదా..."

"లేదులే. చాలా దూరం వెళ్లిపోయాం. ఆదివారం ఇంకా ఎన్ని రోజులుందని! నాలుగు రోజులే. ఈ నాలుగు రోజులూ ఎలాగో ఉండి, ఆ తర్వాత మేం కలిసే అవకాశం చాలా తక్కువ".

"ఏమిటో, ఏం బాగాలేదు, చిన్నపిల్లల్లాగా దెబ్బలాడుకోవడం, కోపాలు సాధించుకోవడం, మాట్లాడుకోకపోవడం, సిల్లీగా..."

ప్రతిభ మీద కోపం వచ్చింది. తమ పోట్లాటని సిల్లీ అన్నందుకు.

సిల్లీ ఎందుకవుతుంది! తనవన్నీ జెన్యుయన్ కారణాలు. అందుకే లాయరు సలహా, కౌన్సిలర్ సలహాలు వినింది. అవి అన్నీ విన్నాక విడాకుల సంగతే మర్చిపోయింది. విక్రాంత్ దాన్ని తిరిగి ఎందుకు రేపాలి! తనని అర్థం చేసుకోవాలి కదా! ఇందులో తన తప్పు ఎక్కడుంది? విడిపోవాలనుకుంటే వెళ్లిపోవచ్చు అని అన్నాడు. అలాంటప్పుడు ఇది సిల్లీ ఏమిటి!... ఇది విక్రాంత్ నిర్ణయం కదా!

"సరే... నువ్వేం అనుకోనంటే, ఓ మాట చెప్తాను. నీకు ఇష్టం ఉన్నా లేకపోయినా... విను..."

"నేనేం వినే స్థితిలో లేను... ఇప్పుడిప్పుడే నా మనసుని దృఢపర్చుకున్నాను. కలిసి ఉండడం కష్టం... ఇంక ఫోన్ పెట్టేస్తాను..." పిల్లలు స్కూలు నుంచి వచ్చే టైమవుతోంది...

"ఆగు... పెట్టేద్దువులే... ఇన్ని విన్నదానివి ఇంకొక్క మాట విను. ఆ తర్వాత నేనే పెట్టేస్తానులే."

"ఒక్క సూటి ప్రశ్న. మీకు పెళ్లయి ఇన్నేళ్ళయ్యాక విడాకులు తీసుకుందామను కుంటున్నారంటే, అందులో పిల్లలు పుట్టాక, అంటే మీరిద్దరూ స్వార్థపరులే.

"నీ పెళ్ళికి ముందు, విక్రాంత్ ఎలాంటివాడో నీకు తెలీలేదా? అప్పుడున్న మైకంలో, ప్రేమలో నీకు కనపడలేదేమో. అప్పుడు చాలా జాగ్రత్తని ఇన్ని ఏళ్ళు ఉపయోగించి ఉండడు కదా! ఆ సంస్కారపు ముసుగుని ఎన్నిరోజులు వేస్తాడు. ఓ రోజూ, రెండు రోజులూ, మహా అయితే కొన్ని రోజులు... ఆ తర్వాత సహజ స్వభావం వచ్చేస్తుంది. అసలు రూపం బయటికి వచ్చేస్తుంది. వచ్చే ఉంటుంది. మరి నువ్వు గమనించలేదా? గమనించే ఉంటావు. అప్పుడు మౌనం వహించావు. ఇద్దరూ కూడా సరిపెట్టుకున్నారు. అప్పుడు వచ్చిన వివాదాలు పెద్దగా కాకుండా సహించారు. అప్పుడున్న సహనం ఇప్పుడేం అయింది! అప్పుడు రాజీపడిపోయినవాళ్ళు, ఇప్పుడు ఎందుకు పడడం లేదు.

"తాడుని తెగేవరూ ఎందుకు లాగుతున్నారు? ఎందుకంటే, మీరిద్దరూ స్వార్థపరులే. మీ వరకే చూసుకుంటున్నారు.

"ఆ తర్వాత గురించి ఆలోచించడం లేదు. అవునా... ఆలోచించు... సుధీరా... ఇంకా టైముంది..."

"లేదు. ప్రతిభా... ఇంక ఆలోచించాల్సినది ఏమీ లేదు. ఇంతవరకూ వచ్చాక, వెనక్కి తిరిగే ప్రసక్తి లేదు. ఆ అవసరం నాకేం కనపట్టం లేదు..."

ఒక్క నిమిషం మౌనం.

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/book/Grahanam**

* * *